క్లుప్తంగా

అధికారులు సమన్వయంతో పనిచేయాలి


మాట్లాడుతున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డుల లబ్ధిదారుల సర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాలను అందరు పాటించాలన్నారు. వార్డు ఆఫీసర్లు, ఫీల్డ్ వెరిఫికేషన్ ఆఫీసర్లు అన్ని నియమనిబంధనలను తెలుసుకుని తప్పులు లేకుండా సర్వే చేపట్టాలన్నారు. కార్పొరేటర్లు, వివిధ సెక్షన్ల అధికారులు, సూపర్‌వైజర్ ఆఫీసర్లు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

కురుమల అభివృద్ధికి కృషి



బండ్లగూడ: కురుమల అభివృద్ధికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని రాష్ట్ర కరుమ సంఘం నాయకుడు బండ సూరి అన్నారు. సంధ్యానగర్‌లో నిర్వహించిన నూతన కేలండర్ ఆవిష్కరణకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. సంఘం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని సంఘం సభ్యులకు ఆయన సూచించారు. ఆరెమైసమ్మ దేవాలయ పునర్నిర్మాణానికి కృషి చేసిన ఆయనను ఘనంగా సన్మానించారు. కార్పొరేషన్ సంఘం అధ్యక్షుడు తాండ్ర రమేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవాజుద్దీన్ అహ్మద్

అత్తాపూర్: ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు నిర్వహించాలని సులేమాన్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నవాజుద్దీన్ అహ్మద్ అన్నారు. బుధవారం ఎంఎంపహాడీలో జరుగుతున్న నూతన సీసీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా సకాలంలో పూర్తి చేయాలన్నారు.

పనులు పూర్తయ్యేదెన్నడు ?

- ఐదేళ్లుగా నిలిచిపోయిన పంచాయతీ భవన నిర్మాణం
- తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజలు, అధికారులు


పిల్లోనిగూడలో నిలిచిపోయిన పంచాయతీ భవన నిర్మాణ పనులు

శంషాబాద్ రూరల్: అనుబంధం వీడి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటై ఐదేళ్లు దాటినా సొంత భవనం సమకూరడం లేదు. భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కమ్యూనిటీ భవనంలోనే పంచాయతీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. మండలంలోని పిల్లోనిగూడ పంచాయతీకి సొంత భవనం లేక ఇబ్బందులు ఎదురౌతున్నాయి.

రూ.20 లక్షల నిధులతో..

ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలతో పంచాయతీ భవనానికి ఏడాదిన్నర క్రితం పనులు మొదలు పెట్టారు. కొన్ని నెలల క్రితమే పనులు నిలిచిపోయాయి. బిల్లులు రాకపోవడంతోనే పనులు నిలిపివేసినట్లు స్థానికులు చెబుతున్నారు.

అనుబంధం వీడి..

పాల్మాకుల, జూకల్ పంచాయతీలకు అనుబంధంగా ఉన్న పిల్లోనిగూడను ప్రత్యేక పంచాయతీ చేసి తాత్కాలికంగా బీసీ కమ్యూనిటీ భవనంలో పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేశారు. గ్రామంలో దాదాపు 1300 మంది జనాభా ఉండగా.. ఇందులో వేయికి పైగా ఓటర్లు ఉన్నారు. ఒకే గది ఉన్న కమ్యూనిటీ భవనంలో పంచాయతీ కార్యకలాపాలు నిర్వహించడం ఇబ్బందిగా మారింది.



పోరాడి స్థలం కేటాయింపు..

పంచాయతీ భవనం నిర్మాణం కోసం గ్రామంలో అనువైన స్థలం దొరకడం లేదు. స్థానికంగా ఉన్న ఓ వెంచరు నిర్వాహకులతో స్థానికులు పోరాడి సుమారు 200 గజాల స్థలాన్ని సేకరించారు. ఈ స్థలంలోనే ప్రస్తుతం భవన నిర్మాణం చేపట్టారు.

త్వరగా పూర్తి చేయాలి..



పంచాయతీ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి. బిల్లులు రాకపోవడంతోనే పనులు నిలిపివేసినట్లు మా దృష్టికి వచ్చింది. మా హయాంలోనే భవనం పూర్తి చేసేందుకు చాలా కృషి చేశాం. అయినా ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు.

– కె.బుచ్చమ్మ, మాజీ సర్పంచ్, పిల్లోనిగూడ

సొడమ్మ ఆలయంలో సంక్రాంతి జాతర


బోనాలు సమర్పిస్తున్న భక్తులు

రాజేంద్రనగర్: హిమాయత్‌సాగర్ బంగారు సొడమ్మ దేవాలయంలో సంక్రాంతి జాతర ప్రారంభమైంది. ప్రతి ఏటా సంక్రాంతి మరుసటి రోజు నుంచి మూడ్రోజుల పాటు సొడమ్మ జాతరను నిర్వహిస్తుంటారు. ఈ జాతరకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. బుధవారం తెల్లవారు జామున ప్రత్యేక పూజ కార్యక్రమాలతో అమ్మవారి జాతరను ప్రారంభించారు. రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, చేవెళ్ల బీజేపీ పార్లమెంటు కన్వీనర్ మల్లారెడ్డి, శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి మల్లిక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. గోల్డెన్‌హైట్స్ కాలనీ, హ్యాపీ హోమ్స్ కాలనీ, జన చైతన్య, ఫోర్ట్ వ్యూవ్ కాలనీ, పర్మారెడ్డి హిల్స్, అశోక్ విహార్ కాలనీ, సత్సంగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

అత్తాపూర్: ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెహిదీపట్నం ప్రాంతానికి చెందిన మహ్మద్ ముస్తఫా(36) ఫర్నిచర్ పనిచేస్తుంటాడు. కుటుంబసభ్యులు చింతల్‌మెట్‌లోని తమ బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్రాకు బయలుదేరిన యాత్రికులు



శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయం నుంచి బుధవారం ఉదయం ఉమ్రా యాత్రికుల బృందం బయలుదేరింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన మొత్తం 60 మంది యాత్రికులు వెళ్లారు. కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. యాత్రను నిర్వాహకులు ఫయాజ్ అలీ పర్యవేక్షిస్తున్నారు.

ప్రారంభమైన దరఖాస్తుల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో దరఖాస్తుల పరిశీలనను ప్రారంభించినట్లు సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. బుధవారం రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్, అత్తాపూర్ డివిజన్లకు చెందిన మొత్తం 7000 దరఖాస్తులు పరిశీలించనున్నట్లు వెల్లడించారు. జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ విభాగాలకు చెందిన 25 మందిని పరిశీలన కోసం కేటాయించామన్నారు. వీరికి ఉదయం సర్కిల్ కార్యాలయంలో శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. దరఖాస్తుల పరిశీలన ఈనెల 25 వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఘనంగా గోదాదేవి కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో పుష్పమాలతో అర్చకస్వామి

మణికొండ: మానవమూర్తిగా జన్మించి చిన్నప్పటి నుంచే శ్రీకృష్ణుడిని ఆరాధించి ఆయనను వివాహం చేసుకున్న గోదాదేవి ఇతి వృత్తంతో ప్రతిఏటా భోగి పండుగ రోజు నిర్వహించే గోదా కల్యాణం మంగళవారం నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల వేణుగోపాలస్వామి ఆలయంలో కనుల పండువగా జరిగింది. ఆలయ ఆవరణలో ప్రత్యేక కల్యాణమండపాన్ని ఏర్పాటు చేసి మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణ విశేషాలను వివరిస్తూ.. అర్చకులు కల్యాణం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన కల్యాణోత్సవం మధ్యాహ్నం వరకు కొనసాగింది. అనంతరం అన్నప్రసాద వితరణలో భక్తులు పాల్గొన్నారు.

అర్హులనే ఎంపిక చేయాలి

మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్


అవగాహన సదస్సులో చైర్మన్, వార్డు అధికారులు

మణికొండ: కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారి నుంచి అర్హులను ఎంపిక చేయాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన బిల్ కలెక్టర్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చి మున్సిపాలిటీ పరిధిలో నివసిస్తున్న వేలాదిమంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో అర్హులైన వారినే ఎంపిక చేయాల్సిన బాధ్యత వార్డు అధికారులపై ఉందని స్పష్టం చేశారు. మున్సిపల్ మేనేజర్ శ్రీధర్, కౌన్సిలర్లు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి హయాంలో హైదరాబాద్ నెంబర్ వన్


మాట్లాడుతున్న చైర్మన్ మెట్టు సాయికుమార్

గన్‌ఫౌండ్రీ: సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ అన్ని రంగాల్లో దేశంలోనే నెంబర్ వన్ స్థాయిలో దూసుకుపోతుందని తెలంగాణ రాష్ట్ర ఫిషరీష్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. ఐటీ, టూరిజంతో పాటు ప్రతిరంగం దేశంలోని అన్ని నగరాల్లో కంటే హైదరాబాద్ నగరం ముందంజలో ఉందన్నారు. సంక్రాంతి సంబరంలో భాగంగా కైట్ ఫెస్టివల్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ప్రపంచ వ్యాప్తంగా పెంచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషి అమోఘం అని మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు.

సన్మానం

గోల్కొండ: గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ముంగి రఘుపాల్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ మాట్లాడుతూ..మార్కెట్ కమిటీ పాలక మండలి నియామకంలో కాంగ్రెస్ నాయకులకు సరైన ప్రాతినిధ్యం లభించిందన్నారు. నాయకులు చంటిబాబు, చంద్రశేఖర్, పరమానందం, రామ్‌కుమార్, అమీద్, గోవర్ధన్‌రెడ్డి, షకీలా, వనజ, శ్యామల, హేమలత తదితరులున్నారు.

నియామకం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా నర్మద సింగ్ నియమితులయ్యారు. బుధవారం గాంధీభవన్‌లో ఆమెకు రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు నియామకపత్రాన్ని అందజేశారు.

ఆనందోత్సాహాలతో సంక్రాంతి

రంగురంగుల ముగ్గులు, పతంగులతో యువత సందడి


అత్తాపూర్ డివిజన్ లక్ష్మీరామ్ హరన్ అపార్ట్‌మెంట్‌లో..

రాజేంద్రనగర్: సంక్రాంతి పండుగను రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. మంగళవారం ఉదయం మహిళలు తమ ఇళ్ల ముందు అందమైన ముత్యాల ముగ్గులు వేశారు. యువత నృత్యాలు చేస్తూ గడిపారు.

మణికొండ: సంక్రాంతి పండుగను మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల ప్రజలు సంబరంగా చేసుకున్నారు. పిండివంటలతో బంధుమిత్రులను ఆహ్వానించి సందడి చేశారు. చాలామంది స్వస్థలాలకు వెళ్లడంతో రోడ్లపై ట్రాఫిక్ కనిపించలేదు. రోడ్లన్నీ బోసిపోయి కనిపించాయి.

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలోని కాటేదాన్, లక్ష్మిగూడ, మైలార్‌దేవ్‌పల్లి, వాంబే కాలనీ, దుర్గానగర్, బాబుల్‌రెడ్డినగర్, పద్మశాలిపురం, టీఎన్జీవోస్ కాలనీ తదితర ప్రాంతాల్లో సంక్రాంతి పండుగను సంబరంగా నిర్వహించుకున్నారు. డీజే, బాక్సుల మోతలు, యువకుల కేరింతలతో యువకులు తమ బిల్డింగ్‌లపై పతంగులు ఎగరవేస్తూ సంబురపడ్డారు.


ముగ్గులు వేస్తున్న మహిళలు


సంక్రాంతి ముగ్గుతో యువతి


మంచిరేవులలో..


హైదర్‌గూడలో..



గగన్‌పహాడ్‌లో..


ఖానాపూర్‌లో గాలిపటాలు ఎగురవేస్తూ..

ముగిసిన వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న గాజుల అంజయ్య

చార్మినార్: చౌక్ మైదాన్ ఖాన్‌లోని బాలాజీ మందిరంలో ఐదు రోజుల పాటు జరిగిన వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వేంకటేశ్వర స్వామిని దాదాపు లక్షన్నర మంది భక్తులు దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ అర్చకులు, అలంకార బ్రహ్మ శృంగారం ఆత్రేయాచార్యులు తెలిపారు. ఈ నెల 10న స్వామి వారి నేత్ర దర్శనంతో ప్రారంభమైన ఉత్సవాలు 12న నమ్మళ్వార్ పరమ పద మహోత్సవాలు, 13న గోదాదేవి కల్యాణం, 14న సంక్రాంతి పూజలు, 15న అమ్మవారికి వడి బియ్యం సమర్పించడంతో ఈసారి ఉత్సవాలు ముగిశాయని ఆయన తెలిపారు. ఉత్సవాల సందర్భంగా పాతబస్తీ వీధుల్లో నిర్వహించిన స్వామి వారి పల్లకీ సేవ సామూహిక ఊరేగింపునకు భక్తుల నుంచి చక్కటి ఆదరణ లభించిందన్నారు. ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య మాట్లాడుతూ.. ఈసారి వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు ఘనంగా జరిగాయన్నారు. ఈ ఆలయంలో 1961 నుంచి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా పలువురిని ఆత్రేయాచార్యులు ఘనంగా సత్కరించి స్వామి వారి ప్రసాదం అందజేశారు.


ముగింపు వేడుకల సందర్భంగా సన్మాన గ్రహీతలు

ప్రత్యేక పూజలు



గోల్కొండ: నానల్‌నగర్ సాలార్‌జంగ్ కాలనీ తిరుపల్లిగడ్డలోని కోవెల రంగనాయక స్వామి ఆలయంలో వార్షిక పూజలు బుధవారం ఘనంగా జరిగాయి. ప్రతి యేటా జరిగే స్వామి వారి పూజలు ఆలయ కార్యనిర్వహణ అధికారి వసంత ఆధ్వర్యంలో జరిగాయి. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ ఎం.నర్సింహ, బీఆర్ఎస్ నాయకులు టి.జీవన్‌సింగ్, మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, శ్రీకాంత్, సోమారపు జనార్దన్ తదితరులున్నారు.

దర్బార్ మైసమ్మ ఆలయంలో..

సంక్రాంతి పండుగ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించామని కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ టి.అమర్‌సింగ్ అన్నారు. బుధవారం ఆలయంలో ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ..దర్బార్ మైసమ్మ దర్శనానికి పండుగ రోజుల్లో పాత నగరం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారన్నారు. బీజేపీ నాయకులు టి.యోగ్‌రాజ్‌సింగ్ తదితరులున్నారు.